క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత



కాజీపేట రూరల్: కాజీపేట మండలం మడికొండకు చెందిన చిన్నారి రక్షిత చికిత్స నిమిత్తం రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ మంగళవారం జారీ చేశారు. ఈమేరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో రక్షిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ పార్టీ పని చేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ప్రతిఒక్కరికి నాణ్యమైన వైద్యం అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఎస్ఆర్నగర్ స్కూల్ పరిశీలన



వరంగల్: నగరంలోని 14వ డివిజన్ ఎస్ఆర్నగర్లోని ప్రభుత్వ పాఠశాలను నియోజకవర్గ మన బడి – మన బాధ్యత కన్వీనర్ దోమ కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థితిగతులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో మన బడి – మన బాధ్యత కార్యక్రమంలో పనుల పరిశీలనకు తనను నియోజకవర్గ కన్వీనర్గా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ నియమించారని తెలిపారు. కాగా, ఆయనకు పాఠశాల సమస్యలపై ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిరి రాజశేఖర్, ఉపాధ్యాయుడు మహేందర్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు పున్నం ప్రభాకర్, కొంగర సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వర్క్షాప్ ప్రొఫెసర్ వినోద్కుమార్కు సన్మానం



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్లో పవర్సిస్టమ్ వర్క్షాప్ ప్రొఫెసర్గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన డీఎం.వినోద్కుమార్ను నిట్ సిబ్బంది మంగళవారం సన్మానించారు. వినోద్కుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ పవర్ ఇంజనీరింగ్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్షాప్ను నిట్లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిట్ రిజిస్ట్రార్ గోవర్ధన్రావు, అకాడమిక్ డీన్ ప్రొఫెసర్ ఉమామహేష్, వెంకయ్య పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ ఓ వరం



కాశిబుగ్గ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం ప్రజలకు ఓ వరంలాంటిదని, దాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ వరంగల్ తూర్పు నాయకుడు కుసుమ సతీష్ సూచించారు. 35వ డివిజన్ పుప్పాలగుట్టలో ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 167 రకాల వ్యాధులకు ఆయుష్మాన్ భారత్ ద్వారా చికిత్స పొందవచ్చని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇనుముల అజయ్, కనుకుంట్ల రంజిత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతనాల పెంపుపై హర్షం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో తాత్కాలిక ఉద్యోగులకు 30శాతం వేతనాలు పెంచడంపై దూరవిద్యా కేంద్రంలోని దినసరి, లంప్సమ్, క్యాజువల్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. కాగా, కేయూ పాలక మండలి సమావేశంలో వేతనాల పెంపుదలకు సోమవారం తీర్మానించి ఆమోదించిన విషయం విదితమే. కార్యక్రమంలో దినసరి వేతన ఉద్యోగుల సంఘం బాధ్యులు సుదయ్య, వేమన్న, గోపి పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణ సదస్సు

న్యూశాయంపేట: నగరంలోని 43వ డివిజన్ తిమ్మాపూర్లో సేవా భారత్ స్వచ్ఛంద సంస్థ హెల్త్ ఎడ్యుకేషన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆరోగ్య పరిరక్షణ సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ ఈదురు అరుణ మాట్లాడుతూ ప్రతిఒక్కరు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో విక్టర్, డాక్టర్ షకీల్, హనుమారెడ్డి, మేకల సూరయ్య, చింత ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి భాషా పండిట్ల బంద్



కమలాపూర్లోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిరసన తెలుపుతున్న భాషా పండితులు



జయశంకర్ భూపాలపల్లిలోని ఓ పాఠశాలలో..

విద్యారణ్యపురి: రాష్ట్ర భాషా పండిట్ జేఏసీ పిలుపు మేరకు బుధవారం నుంచి హనుమకొండ జిల్లాలోని ఎక్కువ శాతం ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్ – 2గా పనిచేస్తున్న భాషా పండితులు తెలుగు, హిందీ, ఉర్దూ బోధనను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా పలువురు భాషా పండితులు మాట్లాడుతూ భాషా పండితులు ప్రమోషన్లు లేక పదవీ విరమణ పొందుతున్నారని తెలిపారు.

అమలు కాని సీఎం హామీ

2017లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా భాషా పండితుల పోస్టులను అప్ గ్రేడ్ చేస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. 2021, ఫిబ్రవరి మాసంలో 8,574 తెలుగు, హిందీ, ఉర్దూ 1852 పీఈటీ పోస్టులను అప్డేట్ చేస్తూ జీఓ 2, 3, 110లను జారీ చేశారు. అయితే, కోర్టు కేసుల సాకుతో పండితులకు పదోన్నతులు నిలిపివేశారు. గతంలో 2005లో ఉమ్మడి సర్వీస్ రూల్స్ సుప్రీంకోర్టులో ఉన్నప్పుడు నాటి ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా ఉపాధ్యాయులకు ప్రమోషన్లు కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. 1982 నుంచి భాషా ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

ఖిలా వరంగల్: రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామిక హక్కులను కలిసికట్టుగా కాపాడుకుందామని స్వేచ్ఛ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర నేత రమాదేవి పిలుపునిచ్చారు. కుల, మత, ఉన్మాద దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సూచించారు. వరంగల్ శివనగర్లోని సీపీఐ తమ్మెర భవనంలో బాలరాజు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశవ్యాప్తంగా కుల మతోన్మాదులు పెరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలో దళిత, మైనార్టీ మహిళలపై హత్యలు దాడులు జరుగుతున్నాయని వాపోయారు. ఉన్మాద చర్యలు వల్ల దేశ ప్రజానీకానికి భద్రత లేకుండా పోయిందని అన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ, భిన్న అభిప్రాయం వ్యక్తం చేసే హక్కులు కోల్పోయే ప్రమాదకర పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ భాషుమియా, సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య, ఎంసీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, న్యూడెమోక్రసీ నాయకుడు ఆరెల్లి కృష్ణ పాల్గొన్నారు.

పథకాల ప్రచారంలో పాత్రికేయుల పాత్ర గొప్పది



కంటి వెలుగు క్యాంపును ప్రారంభిస్తున్న కలెక్టర్

ఎంజీఎం: ప్రభుత్వ పథకాల ప్రచారంలో పాత్రికేయుల పాత్ర గొప్పదని వరంగల్ జిల్లా కలెక్టర్ గోపి పేర్కొన్నారు. జిల్లాలోని పాత్రికేయుల కోసం వరంగల్ ఐఎంఏ హాల్లో ప్రెస్క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే నరేందర్, కలెక్టర్ గోపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 44 టీమ్ల ద్వారా కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేసి ప్రతిఒక్కరు కంటి పరీక్షలు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటరమణ, ఐఎంఏ అధ్యక్షుడు వద్దిరాజు రాకేశ్, ప్రెస్క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



నినాదాలు చేస్తున్న సంఘాల బాధ్యులు

విద్యారణ్యపురి: నిజామాబాద్ జిల్లా కోటగిరి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయుడిపై జరిగిన దాడికి నిరసనగా ఈనెల 2న హైదరాబాద్లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపునిచ్చింది. హనుమకొండలోని డీఈఓ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో టీఎస్యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ రాష్ట్ర బాధ్యులు కె.సోమశేఖర్, నన్నబోయిన తిరుపతి, కడారి భోగేశ్వర్, రావుల రమేష్, జిల్లా బాధ్యులు పెండెం రాజు, బంధం వెంకట్రెడ్డి, సత్యనారాయణ, రఘుపతి, శ్రీనివాస్, సుదర్శన్, గోవిందరావు, సృజన్ప్రసాద్, నర్సింహరావు, పాల్గొన్నారు.

లాఠీచార్జ్ అమానుషం

హన్మకొండ: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఏబీవీపీ నాయకులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అమానుషమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్రెడ్డి పేర్కొన్నారు. మంత్రి కేటీఆర్ పర్యటనను పురస్కరించుకుని బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడాన్ని, ఏబీవీపీ నాయకులపై లాఠీచార్జ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

సేవలో ప్రజల భాగస్వామ్యం అవసరం



మాట్లాడుతున్న బాలథెరిస్సా జింగ్రాస్

కాజీపేట రూరల్: బాలవికాస సేవలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని బాలవికాస వ్యవస్థాపకురాలు బాలథెరిస్సా జింగ్రాస్ అన్నారు. కాజీపేట ఫాతిమానగర్ బాలవికాస ట్రైనింగ్ సెంటర్లో చిరుదాతల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో ఎంత సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఎంత దానం చేశామన్నదే ప్రధానమని అన్నారు. ఇతరులకు సాయం చేయాలనే ఆలోచన ప్రతిఒక్కరిలో ఉండాలని సూచించారు. బాలవికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి మాట్లాడుతూ బాలవికాస సేవ కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో సోషల్ డైరెక్టర్ శోభ, జనవికాస అధ్యక్షుడు లూర్దుమారెడ్డి, జ్యోతి, సరళ, దాతలు, బాలవికాస మహిళాభివృద్ధి కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

‘నగరంలో కానరాని అభివృద్ధి’



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

ఖిలా వరంగల్: వరంగల్ నగరంలో ఎక్కడ చూసినా అభివృద్ధి కానరావడం లేదని కన్స్యూమర్ కోఆర్డినేషన్ కౌన్సిల్ (సీసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు మొగలిచెర్ల సుదర్శన్ ఆరోపించారు. శివనగర్లోని వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యాలయంలో మురహరి కార్తీక్ అధ్యక్షతన వినియోగదారుల ప్రతినిధులు సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సుదర్శన్ మాట్లాడుతూ జరగని అభివృద్ధిని కాగితాల్లో పేర్కొంటూ కేంద్ర సంస్థలకు చూపిస్తూ అవార్డులు తెచ్చి వినియోగదారులను బల్దియా మోసం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో ఈనెల 9, 10 తేదీల్లో కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీకి ప్రజలు సమస్యలపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీసీఐ జిల్లా ప్రతినిధులు డాక్టర్ వీరస్వామి, అల్లాడి వీరభద్రయ్య, మురహరి రాజేష్, రవికుమార్, చిలగాని నరహరి, పత్తిపాక తిరుపతయ్య, తోకల సుధాకర్రెడ్డి, గడ్డం జితేందర్, గుండు ప్రసాద్, దేవేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల అక్రమాలపై ఆరా



డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న అధికారులు

వరంగల్: నగరంలోని 21వ డివిజన్ మొయిన్పురాలో రూ.35 లక్షల వ్యయంతో చేపట్టిన సైడ్ డ్రెయినేజీ పనులు పూర్తిగా నాసిరకంగా జరుగుతున్నట్లుగా కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదులు అందినట్లుగా తెలిసింది. ఈ పనులు పూర్తిగా నాణ్యత లేకుండా జరుగుతున్నాయని ‘సాక్షి’లో ‘నాసిరకంగా అభివృద్ధి పనులు’ అనే కథనం కూడా సోమవారం వచ్చింది. దాంతో స్పందించిన బల్దియా ఇంజనీర్లు.. మొయిన్పురాలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈక్రమంలో అధికారులు వస్తున్నారని తెలియడంతో వారిని పక్కతోవ పట్టించేందుకు సదరు కాంట్రాక్టర్.. సిమెంటు కొంచెం ఎక్కువగా కలిపి నాణ్యతగా పనులు జరుగుతున్నట్లు చూపెట్టడానికి యత్నించారు. ఈవిషయం తెలియడంతో క్వాలిటీ కంట్రోల్ అధికారులు సైడ్ డ్రెయినేజీ పనులను మంగళవారం పరిశీలించారు. పనుల తీరు, నాణ్యత లోపాలను పరిశీలించిన వారు.. ఉన్నతాధికారులతో పాటు కమిషనర్, మేయర్లకు నివేదిక అందిస్తారని తెలిసింది.

సెల్ఫోన్ వినియోగంలో జాగ్రత్త



మాట్లాడుతున్న ఇన్స్పెక్టర్ శ్రీనివాస్

ఖిలా వరంగల్: సెల్ఫోన్ వినియోగంలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని, సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఇన్స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ సూచించారు. ఈమేరకు వరంగల్ రైల్వేగేట్ శాంతినగర్లోని సన్రైస్ గ్రామర్ హైస్కూల్లో ప్రిన్సిపాల్ బాశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ యువత సన్మార్గంలో పయనించాలని సూచించారు. మొబైల్కు వచ్చే మోసపూరితమైన కాల్స్, లింక్స్, మెసేజీలను స్పందించవద్దని అన్నారు. సైబర్ మోసానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే 1930 నంబర్కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ శారత, ఎస్సైలు శ్రీలత, రాజేందర్, కుమార్, అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

సేవలందించడం అభినందనీయం



జ్ఞాపిక అందజేస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ చౌరస్తా: నగర ప్రజలకు సుదీర్ఘకాలం సేవలందించడం అభినందనీయమని, ప్రతి ఉద్యోగికి పదవి విరమణ సహజమని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. బల్దియా జేఏసీ ఆధ్వర్యంలో ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన ఉద్యోగుల పదవి విరమణ కార్యక్రమంలో మేయర్తో పాటు కమిషనర్ ప్రావీణ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులు సంపత్కుమార్, సాంబయ్యకు జ్ఞాపికలు అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ రషీద్, శ్రీనివాస్ రెడ్డి, ఎంహెచ్ఓ రాజేష్, జేఏసీ అధ్యక్షుడు గౌరీశంకర్, శానిటరీ సూపర్వైజర్ సాంబయ్య, సూపరింటెండెంట్ ఆనంద్, జేఏసీ కార్యవర్గ సభ్యులు గోల్కొండ శ్రీను, బొట్ల రమేష్, మహేష్, బల్దియా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అదనపు విద్యుత్ చార్జీల వసూలు సరికాదు



నిరసన తెలుపుతున్న నాయకులు

కాశిబుగ్గ: రాష్ట్రంలో ఏసీడీ (అడ్వాన్స్డ్ కంజంప్షన్ డిపాజిట్) పేరిట వసూళ్లు చేస్తున్న అదనపు విద్యుత్ చార్జీలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా వరంగల్ జిల్లా నాయకుడు పసునూరు రాజు డిమాండ్ చేశాడు. ఈమేరకు శివనగర్ విద్యుత్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విద్యుత్ మండలికి రూ.33 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వం బకాయి ఉందన్నారు. ఈక్రమంలో బకాయిలను ప్రభుత్వం నుంచి రాబట్టుకోవాల్సిన రాష్ట్ర విద్యుత్ మండలి అధికారులు.. ప్రజలపై డెవలప్మెంట్ పేరుతో అదనపు విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగానికి 24 గంటలపాటు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో నరసింహరావు, మోహన్, వెంకటస్వామి, చిన్నస్వామి, ఎల్లయ్య, రాజయ్య, వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్యులు, నాయకులు

వరంగల్ చౌరస్తా: ఆరోగ్యం పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆయుర్వేదిక వైద్యులు సూచించారు. వరంగల్ 27వ డివిజన్లోని గోవిందరాజుల గుట్ట కింద వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం ఆరోగ్య సూత్రాలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తుమికి రమేష్బాబు, బీఆర్ఎస్ నాయకులు చింతాకుల సునీల్ కుమార్, కొమ్ము శ్రీధర్, రమేష్, వైద్యులు అశోక్ కుమార్, శ్రీధర్, మైదం రాజు, జ్యోతి, సుధాకర్ పాల్గొన్నారు.

అర్చకుల సంక్షేమానికి కృషి

హన్మకొండ కల్చరల్: అర్చకుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. వరంగల్ జిల్లా కమలాపూర్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడానికి వచ్చిన కేటీఆర్.. తెలంగాణ అర్చక, ఉద్యోగ జేఏసీ 2023వ నూతన సంవత్సరం డైరీని మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మంత్రులు దయాకర్రావు, కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ కౌశిక్రెడ్డి, అర్చక జేఏసీ రాష్ట్ర చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ, అర్చక సంఘాల నాయకులు ప్రణవ్, భరత్కుమార్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

హామీల అమలులో పాలకులు విఫలం

కాజీపేట: ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో పాలక పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని సీపీఎం జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఏల్లేష్ విమర్శించారు. కాజీపేట పట్టణంలో మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4నుంచి 6వరకు జరగనున్న జిల్లా స్థాయి శిక్షణ తరగతులను రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం వైఎస్సార్నగర్ కాలనీ గ్రామ కమిటీ కార్యదర్శిగా జానపట్ల మంజులను ఎన్నుకున్నారు.

ఉత్సవ విగ్రహాల అందజేత

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం ఆవరణలోని సంతాన లింగేశ్వర స్వామి ఆలయానికి శివ, పార్వతుల ఉత్సవ విగ్రహాలను మంగళవారం దాతలు అందజేశారు. హైదరాబాద్కు చెందిన గీతావాణి – చంద్రకుమార్ దంపతుల తరఫున విగ్రహాలను ఆలయ మేనేజర్ ఎల్.రవికి జి.సునీల్ అందజేశారు.

ఎల్లమ్మ తల్లికి వెండి పాదాల వితరణ

వరంగల్ చౌరస్తా: వరంగల్ 26వ డివిజన్లోని గిర్మాజీపేట చార్బౌలిరోడ్డులోని ఎల్లమ్మ దేవాలయంలో సూర్యచంద్ర సమేత శివలింగం ఎల్లమ్మ అమ్మవారికి కూరపాటి పెంటయ్య కుటుంబ సభ్యులు మంగళవారం వెండి పాదాలు సమర్పించారు.

రేపు జోన్స్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు

హసన్పర్తి: హసన్పర్తి జోన్స్థాయి కబడ్డీ క్రీడాకారుల ఎంపికలు (హసన్పర్తి, ఆత్మకూరు, దామెర) గురువారం నిర్వహించనున్నారు. ఈమేరకు భీమారంలో మంగళవారం జరిగిన సమావేశంలో కబడ్డీ అసోసియేషన్ హసన్పర్తి మండల అధ్యక్షుడు అటికం రవీందర్ తెలిపారు. భీమారంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

డ్రెయినేజీని బాగుచేయరూ..

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్ బాపూజీనగర్ మెయిన్రోడ్డుకు ఆనుకొని ఉన్న డ్రెయినేజీని బాగు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు డ్రెయినేజీని నాయకులు చిలువేరు మహేష్, కాలమల మహేందర్, బర్ల యాకూబ్ మంగళవారం పరిశీలించారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

కాజీపేట రూరల్: మడికొండ పోలీస్ ట్రైనింగ్ క్యాంప్నకు తరలించిన కమలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులను హనుమకొండ జిల్లా కాంగ్రెస్పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్రెడ్డి మంగళవారం కలిసి సంఘీభావం ప్రకటించారు. మంత్రి తారకరామారావు కమలాపూర్ పర్యటనలో భాగంగా మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి మడికొండ పోలీస్ ట్రైనింగ్ క్యాంపునకు తరలించారు.

కబడ్డీ, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు

కాశిబుగ్గ: ఛత్రపతి శివాజీ మహరాజ్ 393వ జయంతి సందర్భంగా శివాజీ మహరాజ్ యువసేన, సేవా భారతి వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రతినిధి తిరుమల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న కాశిబుగ్గలోని వివేకానంద విద్యాకేంద్రంలో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు, 19న స్టాండర్డ్ హైస్కూల్ మైదానంలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 81067 17621, 97010 97143 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా కందిమల్ల మహేష్

ఖిలా వరంగల్ / కాశీబుగ్గ సెంటర్: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా తూర్పుకోట ప్రాంతానికి చెందిన కందిమల్ల మహేష్ నియమితులయ్యారు. ఈమేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ జారీ చేయగా, నియామక ఉత్తర్వులను బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్రావు నుంచి మహేష్ మంగళవారం అందుకున్నారు.

ఆదర్శ లా కళాశాల విద్యార్థుల సంఘం ఎన్నిక

విద్యారణ్యపురి: హనుమకొండలోని ఆదర్శ లా కళాశాల విద్యార్థుల సంఘం ఎన్నికైంది. మంగళవారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పెండ్యాల కొమురయ్య, ఉపాధ్యక్షులుగా బండి అనిల్కుమార్, విద్యాసాగర్, ప్రవళిక, సౌమ్య, సెక్రటరీలుగా సత్య, ఠాకూర్, దివ్య, డానియల్, శ్రేయ, ఆర్థిక కార్యవర్గ సభ్యులుగా జి.సురేందర్, దీప ఎన్నికయ్యారు. అనంతరం, కళాశాల చైర్మన్ బూర విద్యాసాగర్, ప్రిన్సిపాల్ ప్రతిభారాథోడ్ను కార్యవర్గం సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు.

మంత్రి కేటీఆర్కు ఘన స్వాగతం

నయీంనగర్: మంత్రి కేటీఆర్ను హనుమకొండ ఆర్ట్స్ కళాశాల హెలిపాడ్ వద్ద కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్ కలిశారు. ఈమేరకు మంత్రికి పూల మొక్క అందించి స్వాగతం తెలిపారు.

వీసీ, రిజిస్ట్రార్లను కలిసిన కుర్టా బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈమేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్రావును కార్యవర్గ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం, జనరల్ సెక్రటరీ వడ్డె రవీందర్ పాల్గొన్నారు.

డీసీపీకి శాంతిసంఘం శుభాకాంక్షలు

హసన్పర్తి: సెంట్రల్ జోన్ డీసీపీ మహ్మద్ అబ్దుల్ బారిని శాంతి సంఘం వరంగల్ శాఖ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో శాంతి సంఘం వరంగల్ శాఖ చైర్మన్ డాక్టర్ అనీస్ సిద్ధిఖీ, కార్యదర్శి కౌసర్ ఫారుఖీ, సభ్యులు లాజరస్, ప్రొఫెసర్ ముస్తాక్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ పాలకవర్గం గడువు పొడిగింపు

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం పదవీకాలం గడువును పొడిగిస్తూ వ్యవసాయ, సహకార శాఖ ప్రభుత్వ కార్యదర్శి రఘునందర్రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పదవీకాలం గడువు ఆగస్టు 19వరకు ఉంటుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. మార్కెట్ యాక్టు సవరణ ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఉత్తర్వుల ప్రకారం గత పాలక వర్గంకు చైర్పర్సన్గా వ్యవహరించిన దిడ్డి భాగ్యలక్ష్మి పాలకవర్గం మరో ఆరునెలల పాటు గడువు పొడిగింపు అమలులోకి వస్తుంది.

వైజ్ఞానిక ప్రదర్శనలో బహుమతులు

కాశీబుగ్గ సెంటర్: జనవరి 27 నుంచి 31వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని త్రిసూర్లో జరిగిన సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్ పోటీల్లో జిల్లా విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బహుమతులు గెలుచుకున్నట్లు డీఈఓ వాసంతి తెలిపారు. గణిత విభాగం కోడింగ్, డీకోడింగ్లో జెడ్పీహెచ్ఎస్ నెక్కొండ పాఠశాల విద్యార్థులు బిందు, స్రవంతి, గైడ్ టీచర్ బండారి రమేష్, హైడ్రోఫోనిక్ ఫామింగ్ విభాగంలో ఆల్ఫోర్స్ స్కూల్ విద్యార్థులు శ్రీపాద, గైడ్ టీచర్ రంజిత్లు బహుమతులు గెలుచుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను డీఈఓ అభినందించారు.

నేడు ‘మన ఊరు–మన బడి’ ప్రారంభం

కాశీబుగ్గ సెంటర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పనులు పూర్తి చేసిన పాఠశాలలను నేడు అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ మేరకు జిల్లాలోని గీసుకొండ మండలం మొగిలిచర్ల గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలను పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి నేడు (బుధవారం) ప్రారంభించనున్నట్లు డీఈఓ ఒక ప్రకటనలో వాసంతి తెలిపారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

గీసుకొండ: స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగనిర్ధారణ విషయంలో రిజిస్టర్ స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రుల జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో లింగ నిష్పత్తి సమానంగా ఉండేలా చూడాలన్నారు. పీసీపీఎన్డీటీ చట్టాన్ని ఉల్లంఘించే వారిపై, గర్భిణులను స్కానింగ్ చేసిన వెంటనే వారి వివరాలను జిల్లా కార్యాలయానికి పంపని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఒలింపియాడ్ పోటీల్లో రాణించిన విద్యార్థులు

కాజీపేట: విష్ణుపురి కాలనీకి చెందిన సీడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఒలింపియాడ్ ఫలితాల్లో మొదటి రెండు ర్యాంకులు సాధించారు. ఈమేరకు పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న సాన్వి, ప్రియన్స్లకు పోటీల నిర్వాహకులు సయ్యద్ ప్రశంస పత్రాలతో పాటు మెమోంటోలు అందజేశారు. ఈమేరకు ఆ విద్యార్థులకు హెచ్ఎం సుమలత, ఉపాధ్యాయులు అభినందించారు.

నేషనల్ క్విజ్ పోటీల్లో ‘గ్యాబ్రియల్’ ప్రతిభ

కాజీపేట రూరల్: నేషనల్ క్విజ్ కాంపిటీషన్ పోటీల్లో సెయింట్ గ్యాబ్రియల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారని స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ అరుణ్ప్రకాష్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 29న మద్రాస్ ఐఐటీ ఆధ్వర్యంలో జరిగిన 23వ శాస్త్ర స్పార్క్ క్విజ్ ప్రజెంటేషన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 9, 10వ తరగతి విద్యార్థులు జి.రోహిత్ సాగర్, వై.శైలేష్, బి.సాత్విక్ను అభినందించారు.